నేడు బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

● హాజరు కానున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్, ఎంపీ ఈటల

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో గురువారం నిర్వహించనున్న తిరంగా ర్యాలీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్ హాజరవుతున్నట్లు స్వచ్ఛ భారత్ అభియాన్ ఫౌండేషన్ చైర్మన్ మాధవరం కాంతారావు తెలిపారు. 79 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో మార్చ్ ఫర్ ది నేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జేఎన్‌టీయూ వద్ద ర్యాలీ ప్రారంభమవుతోందన్నారు. జేఎన్‌టీయూ నుంచి కేపీహెచ్‌బీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, హుడా ట్రక్ పార్కు వరకు కొనసాగుతోందన్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



రామచందర్‌రావును సన్మానిస్తున్న ప్రీతంరెడ్డి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును బుధవారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ కంటెస్టెడ్ అభ్యర్థి ప్రీతంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందని, ఆయన ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, కోటేశ్వరరావు, చిన్న, మనోహర్, మహేందర్, నర్సింహులు, మురళి, వరలక్ష్మి, సులోచన, హరి, హుస్సేన్, మల్లికార్జున్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అందుబాటులోకి 24/7 హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు 24/7 పనిచేస్తున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్లు. మూసాపేట్ సర్కిల్ కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, అల్లాపూర్, మూసాపేట్, ఫతేనగర్ డివిజన్లు ఉన్నాయి. నాలాలు పొంగుతున్నా, భూగర్భ డ్రైనేజీలు, రోడ్లు బ్లాక్ అయినా, చెట్లు విరిగిపడ్డా, విద్యుత్ స్తంభాలు విరిగినా ఇతరత్రా ఇబ్బందులు ఏమైనా ఉంటే హైడ్రాకు ఏ సమయంలోనైనా ఫోన్ చేసి తెలపవచ్చు. మీరు చేయాల్సిందల్లా మీరు నివాసం ఉంటున్న కాలనీ లేదా బస్తీ, డివిజన్ పేరు తెలియజేస్తే అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది 5-10 నిమిషాల్లో హైడ్రా, డీఆర్ఎఫ్ మాన్‌సూన్ బృందాలు చేరుకుంటాయని జంట సర్కిళ్ల ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటలు అందుబాటులో ఉంటున్నారన్నారు. ఆపదలో ఉంటే తక్షణమే తమకు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సంప్రదించాల్సిన నంబర్లు..

హైడ్రా కంట్రోల్ రూం నంబర్ 9000113667. కూకట్‌పల్లి సర్కిల్- 6309062594. మూసాపేట్ సర్కిల్- 8121041529. జంట సర్కిళ్ల ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్- 8712407139.

దినసరి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

భెల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల ఉపాధి కోల్పోతున్న దినసరి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) లేబర్ సెల్ మజ్దూర్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సురేందర్ కార్మిక శాఖ అధికారులను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గతకొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో రోజువారీ కూలి పనులు దొరకక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు జీతాలను ఆపకుండా, మానవతాదృక్పదంతో సహకారం అందించాలని కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

'వాహనదారుల సమస్యలు పరిష్కరిస్తాం'

మియాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని బొల్లారం మెయిన్ రోడ్డులో సత్యలక్ష్మి నగర్ కాలనీ, మయూరీనగర్ కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ హై టెన్షన్ లైన్ కింద నాలా మీద కల్వర్టుల నిర్మాణం చేపట్టే ప్రాంతాలను హెచ్ఎండీఏ అధికారులు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్‌లో విడతల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ డీఈ విద్యాసాగర్, ఏఈ ఆశిష్, జేఈ ఐకే రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీఈ దుర్గాప్రసాద్, జలమండలి డీజీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు పనుల గురించి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

కూరగాయల రేట్లు ఇలా

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతు బజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి.

కూర	ధర(కిలో)		
టమాట	37	ఉల్లిగడ్డ	22
వంకాయ	23	మామిడికాయ (ఒకటి)	15-20
బెండకాయ	45	అరటికాయ (ఒకటి)	08-10
పచ్చి మిర్చి	45	చామగడ్డ	23
బజ్జి మిర్చి	55	ముల్లంగి	6-8
కాకరకాయ	23	చిలగడ దుంప	35
బీరకాయ(ఒకటి)	28	గుమ్మడికాయ	30
క్యాబేజీ	13	నిమ్మకాయలు(డజన్)	16-20
బీన్స్	50	మునగ కాయలు(ఒకటి)	4-5
క్యారెట్	45	పచ్చిబఠాణి	40
గోబి పువ్వు(ఒకటి)	20	బొప్పాయి	40
దొండకాయ	23	పుట్టగొడుగులు	40
చిక్కుడుకాయ	55	ఎండు మిర్చి	160
గోరు చిక్కుడు	28	అల్లం	100
బీట్‌రూట్	28	వెల్లుల్లి	160
క్యాప్సికం	40	చింతపండు	160
ఆలుగడ్డ	23	పండు మిర్చి	80
కీర	23	ఉసిరి	80
దోసకాయ	15	కరివేపాకు	60
సొరకాయ	15	పర్వల్	60
పొట్లకాయ	18	పల్లికాయ	65
కంద	45	లోబా	23
ఉల్లిపొరక	35	కాకరకాయ	60





ఈ వ్యర్థాలు తొలగించరూ.. !

కేపీహెచ్‌బీ ఐదోఫేజ్‌లోని వినాయక పార్కు వెంట వ్యర్థాలు పడేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీమార్ట్‌కు వెళ్లేటప్పుడు ఎడమవైపు ఉన్న పార్కు ప్రహరీ వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి)



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట బారికేడ్లతో మూసేసిన యూటర్న్



ఐసీఐసీఐ బ్యాంకు ఎదురుగా యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సు, రహదారిలో నిలిచిన వాహనాలు

ట్రాఫిక్ జామ్..

- ఎన్టీఆర్ విగ్రహం ముందు యూటర్న్ మూసివేత
- ఇబ్బందుల్లో వాహనదారులు
- కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసుల శైలిపై అసహనం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. జేఎన్‌టీయూ ఎదురుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న యూటర్న్‌ను నాలుగు రోజుల క్రితం పోలీసులు మూసేశారు. దీంతో వాహనదారులు ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి ఆరేళ్ల క్రితం ఎన్టీఆర్ విగ్రహం ముందున్న డివైడర్‌ను తొలగించి అక్కడ యూటర్న్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ యూటర్న్ వల్ల వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేవి. అలాంటి యూటర్న్‌ను పోలీసులు ఎందుకు మూసివేశారనేది తెలియక వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంకు వద్ద యూటర్న్ తీసుకువాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో వెనకాల వాహనాలు బారులు తీరుతున్నాయి. ఒక్కోసారి రాజీవ్ గాంధీ ఫ్లైఓవర్ వరకు ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎన్టీఆర్ విగ్రహం వద్ద యూటర్న్‌ను ప్రారంభించడమా లేదా ప్రత్యామ్నాయ మార్గాలను చూపి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు ఎలా స్పందిస్తారో చూడాలి.

మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

● అల్లాపూర్ సీఐ వెంకటరెడ్డి

అల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పండగ సీజన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులు భద్రత పాటించాలని సీఐ వెంకటరెడ్డి తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ కాలనీలో అల్లాపూర్ పీ.ఎస్. అధికారులు పీస్ కమిటీ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాయత్రి నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోవు వినాయక చవితి పండగ దృష్ట్యా మండపాల ఏర్పాటులో నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు పాటించాలన్నారు. కాలనీల్లో వీధులు వెడల్పు లేవన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలకు వెళ్లేలా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం కారణంగా విద్యుత్ ప్రమాదాలకు తావివ్వకుండా నాణ్యమైన విద్యుత్ కేబుళ్లతో అలంకరణ దీపాల వైరింగ్ చేయించాలని అల్లాపూర్ ఎస్.హెచ్.ఓ వెంకటరెడ్డి అన్నారు. బాధ్యతాయుత ఎలక్ట్రిషియన్లతో ఆయా ఈ పనులు చేయించాలని జాగ్రత్తలు సూచించారు. రాత్రిళ్లు 10 గంటల తర్వాత గృహవాసులకు అసౌకర్యం కల్గకుండా ధ్వనులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాయత్రి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు, సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, జితేంద్ర, నాయుడు, ఎస్సై మాల్యా నాయక్ పాల్గొన్నారు.



సీఐ వెంకటరెడ్డిని సన్మానిస్తున్న గాయత్రినగర్ సంక్షేమ సంఘం సభ్యులు

వినాయకచవితి లోపు రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

కూకట్‌పల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పైప్‌లైన్ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వారు కాని కేవలం మట్టితో పూడ్చడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం భరత్‌నగర్‌లో స్థానికులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డును తవ్వి వదిలివేయడంతో వరసగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని, భారీ వాహనాలు రావడంతో ఇవి ఎటు కదలకుండా ఇరుకున్నాయన్నారు. వినాయకచవితి పండగ వస్తుందని తవ్విన రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కోరారు. జీఎం రాజశేఖర్, మేనేజర్ వివేక్‌లతో ఫోన్‌లో మాట్లాడి రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి, పవన్‌రెడ్డి, సురేశ్‌నాయుడు, ఉమాపతిగౌడ్, జ్యోతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

ఎంఐజీ కాలనీ అభివృద్ధికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- రూ.97 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

భెల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎంఐజీకాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, కాలనీవాసులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. భారతీనగర్ డివిజన్ ఎంఐజీకాలనీలో రూ.97లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఐజీకాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, సొసైటీ మాజీ డైరెక్టర్లు నారాయణగౌడ్, సుబ్బారావు, నీలకంఠం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

హైదర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారికి వెన్నుదన్నుగా నిలుస్తుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని యూత్‌కాలనీకి చెందిన శ్రీరాములు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా అతనికి మంజూరైన రూ.25వేల చెక్కును బుధవారం వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో లబ్ధిదారుడికి ఎమ్మెల్యే అందజేశారు.



సమావేశంలో బండి రమేష్

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

● కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆంజనేయనగర్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మహిళా గ్రూపులను బలోపేతం చేసి, ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ కోసం పనిచేసే మహిళా నాయకులకు పదవులు, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రజిత, రీనా తదితరులు పాల్గొన్నారు.



గర్భిణి రీతూయాదవ్‌కు జన్మించిన మగశిశువుతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ లక్ష్మణ్, పైలెట్ అద్విత్‌రెడ్డి

108లో ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం ● చికిత్స కోసం గాంధీకి తరలింపు

కూకట్‌పల్లి, ఆగస్ట్13 (ఆంధ్రజ్యోతి): 108లో మహిళకు ప్రసవమైంది. ఆమెకు మగశిశువు జన్మించాడు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. విషయానికొస్తే.. బతుకుదేరువు కోసం చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన రీతూయాదవ్ హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్నారు. ఏడు నెలల గర్భిణి రీతూయాదవ్‌కు పురిటినొప్పులు రావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. మెడికల్ టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ అద్విత్‌రెడ్డిలు ఈ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే పురుటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో గర్భిణిని ఎక్కించి టెక్నీషియన్ లక్ష్మణ్ పురుడుపోశాడు. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. వెంటనే వైద్యచికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. టెక్నీషియన్‌ను పలువురు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చందానగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ శశిరేఖ సూచించారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను అధికారులతో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు. మల్కాం చెరువులోకి వస్తున్న వరదనీరు, చెరువు కట్ట, పలు ప్రాంతాల్లో రోడ్లపై చేరిన వర్షం నీటిని సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అవసరం లేకుండా బయటికి రావద్దన్నారు. బయటికి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న ఉపకమిషనర్ శశిరేఖ

చెత్త పేరుకుపోకుండా చూడాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, అందుకు కారణమైన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ఉపకమిషనర్ శశిరేఖ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బుధవారం చందానగర్ మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలలో, రహదారులపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దొంగ ఓట్లను తొలగించండి

గచ్చిబౌలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దొంగ ఓట్లు చాలా ఉన్నాయని, వాటిని తొలగించాలని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కోరారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎన్నికల అధికారి శశిరేఖ ఆధ్వర్యంలో ఓటర్ లిస్టుపై ఆల్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఈ సమస్యను లేవనెత్తారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న దొంగ ఓట్ల తొలగింపులో భాగంగా శేరిలింగంపల్లిలో ఉన్న దొంగ ఓట్లు తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లిలో 7,68,000కు పైగా ఓటర్లు ఉండగా, ఎన్నికల సమయంలో 40శాతం కూడా పోలింగ్ నమోదు కావడం లేదని, దీంతో దొంగ ఓట్లు ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి దొంగ ఓట్లను తొలగించాలని కోరారు. స్పందించిన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో త్వరలో ఇంటింటి సర్వే జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలు కూడా తమకు సహకరించాలని, సర్వే నిర్వహించి ప్రతీ బూత్‌లో 1200 మంది ఓటర్లు ఉండేలా ఓటర్ జాబితాను రూపొందిస్తామన్నారు.



పార్టీల నాయకులతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఇన్‌చార్జి ఎన్నికల అధికారి శశిరేఖ


ఓపెన్ జిమ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

హైదర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ ఫేజ్-3 కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు కోసం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అధికారులతో కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు, ఎమ్మెల్యే గాంధీ సహకారంతో భాగ్యనగర్ ఫేజ్-3కు ఓపెన్ జిమ్ మంజూరైందని, జిమ్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించామన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. జిమ్ ఏర్పాటుతో స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ కనీసం గంట సమయం వ్యాయామానికి కేటాయించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఏఈ రాజీవ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఇంద్ర హిల్స్‌లో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్, అధికారులు

పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

హైదర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఇంద్రహిల్స్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పాదయాత్ర చేశారు. సీసీ రోడ్లకు సంబంధించి పెండింగ్ పనులు ఉన్నాయని స్థానికుల వినతి మేరకు కాలనీలో ఇంజనీరింగ్, హైడ్రా అధికారులతో కలిసి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ లైన్ తరుచుగా పొంగుతుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, మ్యాన్‌హోల్స్ లోపల ప్లాస్టింగ్ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లను త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఇంద్రహిల్స్‌లో ఇప్పటికే డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకట్ నాయక్, రామారావు, నాగేందర్, కిషోర్, రమేష్, విఠల్, విజయ్, శ్రీశైలం, రాకేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపర్‌వైజర్ శివ, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.


కల్వర్ట్ పనుల గురించి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

వాహనదారుల సమస్యలు పరిష్కరిస్తున్నాం

మియాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని బొల్లారం మెయిన్ రోడ్డులో సత్య లక్ష్మి నగర్ కాలనీ, మయూరీనగర్ కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ హై టెన్షన్ లైన్ కింద నాలా మీద కల్వర్టుల నిర్మాణం చేపట్టే ప్రాంతాలను హెచ్‌ఎండీఏ అధికారులు, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో డివిజన్‌లో విడతల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ డీఈ విద్యాసాగర్, ఏఈ ఆశిష్, జేఈ ఐకే రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీఈ దుర్గాప్రసాద్, జలమండలి డీజీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.


డ్రగ్స్ నియంత్రణకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు అధ్యాపకులు

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఖేల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన ఉండాలని బీహెచ్‌ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ అన్నారు. భెల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవీందర్ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడిస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కొన్ని అసాంఘిక శక్తులు యువతను చెడుమార్గాల వైపు ప్రోత్సహిస్తూ, వారికి మాదకద్రవ్యాలను అలవాటు చేస్తున్నారని, అటువంటి వారిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ విక్రయిస్తున్న వారిని పసిగట్టి ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మనుషుల అక్రమ రవణా, మద్యపానం, డ్రగ్స్, మత్తపానీయాలపై అవగాహన కలిగి ఉంటూ విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. క్రీడలు, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు.

ఆలయాల్లో హుండీలు పగులగొట్టి చోరీ

చందానగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో హుండీలను పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపన్‌పల్లి తండాలోని మారెమ్మ తల్లి, సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో మంగళవారం రాత్రి 9.30 గంటలకు అర్చకుడు పూజలు ముగించుకుని తలుపులను మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం 5గంటలకు వెళ్లగా రెండు ఆలయాల్లో గుర్తుతెలియని వ్యక్తులు హుండీలను పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.80వేలను దొంగలు అపహరించుకుపోయారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వర్షంలోనే వెళ్తున్న ప్రజలు


లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద అధ్వానంగా మారిన రహదారి

తగ్గని వాన.. తప్పని కష్టాలు

- ఎడతెరిపి లేని వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చెరువులను తలపిస్తున్న రోడ్లు
- అత్యవసరమైతేనే బయటకు రావాలంటున్న అధికారులు

చందానగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బుధవారం వర్షం దంచికొట్టింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలకు, కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో వర్షం కురవడంతో ఉద్యోగులు, విద్యార్థులు తడిసి ముద్దయ్యారు. రహదారులపై వర్షం నీరు నిలవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. మరోవైపు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పలువురు ఇళ్లకే పరిమితమయ్యారు. నియోజకవర్గంలోని పలు ఫ్లైవంతెనలపై సైతం ట్రాఫిక్ జామ్ అయింది. కొండాపూర్, కొత్తగూడ,చందానగర్, గోపన్‌పల్లి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఉన్న ఫ్లైవంతెనలపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కొన్ని ప్రాంతాల్లో ఎమర్జెన్సీ టీమ్‌లు, హైడ్రా సిబ్బంది రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

72 గంటల పాటు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి.భారీ వర్షాల వల్ల రోడ్లపై ఉన్న మ్యాన్‌హోల్స్ తెరుచుకునే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి.

- శశిరేఖ, డిప్యూటీ కమిషనర్, చందానగర్ సర్కిల్-21

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎమ్మెల్యే గాంధీ ప్రజలకు సూచించారు. వర్షాలతో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లపై నీరు నిలవడం వంటి సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులకు లేదా ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. అధికారులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, జీహెచ్‌ఎంసీ అధికారులు, హైడ్రా సిబ్బంది, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

రేపు దివ్యాంగుల మహాగర్జన

గచ్చిబౌలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న చందానగర్ మున్సిపల్ కల్యాణమండపంలో దివ్యాంగుల మహాగర్జన నిర్వహిస్తున్నట్లు మేకల అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పీఎస్ దివ్యాంగుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని చెప్పారు. దివ్యాంగులకు రూ.6వేల పింఛన్, వితంతు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

ఎంఐజీ కాలనీ అభివృద్ధికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- రూ.97లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఖేల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎంఐజీకాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, కాలనీవాసులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. భారతీనగర్ డివిజన్ ఎంఐజీకాలనీలో రూ.97లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఐజీకాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, సొసైటీ మాజీ డైరెక్టర్లు నారాయణగౌడ్, సుబ్బారావు, నీలకంఠం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హైదర్‌నగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారికి వెన్నుదన్నుగా నిలుస్తుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని యూత్‌కాలనీకి చెందిన శ్రీరాములు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి మంజూరైన రూ.25వేల చెక్కును బుధవారం ఎమ్మెల్యే గాంధీ వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు.


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న శేరిలింగంపల్లి ఇన్‌చార్జి ఎన్నికల అధికారి శశిరేఖ

శేరిలింగంపల్లిలో దొంగ ఓట్లను తొలగించాలి

గచ్చిబౌలి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దొంగ ఓట్లు చాలా ఉన్నాయని, వాటిని తొలగించాలని పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు వీఆర్వోను కోరారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎన్నికల అధికారి శశిరేఖ ఆధ్వర్యంలో ఓటర్ లిస్టుపై ఆల్‌పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఈ సమస్యను లేవనెత్తారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న దొంగ ఓట్ల తొలగింపులో భాగంగా శేరిలింగంపల్లిలో ఉన్న దొంగ ఓట్లు తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లిలో 7,68,000కు పైగా ఓటర్లు ఉండగా, ఎన్నికల సమయంలో 40శాతం కూడా పోలింగ్ నమోదు కావడం లేదని, దీంతో దొంగ ఓట్లు ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి దొంగ ఓట్లను తొలగించాలని కోరారు. స్పందించిన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో త్వరలో ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు కూడా తమకు సహకరించాలని, సర్వే నిర్వహించి ప్రతీ బూత్‌లో 1200 మంది ఓటర్లు ఉండేవిధంగా ఓటర్ లిస్ట్ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, బీఆర్ఎస్, ఎంసీపీఐ(యు) నాయకులు పాల్గొన్నారు.

రోజువారీ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఖేల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల ఉపాధి కోల్పోతున్న దినసర కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్) లేబర్ సెల్ మజ్దూర్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సురేందర్ కార్మిక శాఖ అధికారులను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గతకొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో రోజువారీ కూలి పనులు దొరకక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు జీతాలను ఆపకుండా, మానవతాదృక్పదంతో సహకారం అందించాలని కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

బీహెచ్‌ఈఎల్‌లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

- సంస్థ ఈడీని కోరిన పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


బీహెచ్‌ఈఎల్ ఈడీ కేబీ రాజా, తదితరులతో సమావేశమైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఖేల్‌కాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన స్థానిక నిరుద్యోగులకు బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బీహెచ్‌ఈఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.భరణీధర్ రాజాను కోరారు. ఈ మేరకు బుధవారం భెల్ పరిపాలన భవనంలో పలువురు ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పరిశ్రమలో జరుగుతున్న ఉద్యోగ భర్తీల్లో స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యతఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసిందని, భవన నిర్మాణం కోసం బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం సీఎస్ఆర్ పథకం కింద నిధులు కేటాయించాలని కోరారు. పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేస్తే స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. ఇక్రిశాట్ ఫెన్సింగ్ ప్రాంగణంలో ఉన్న పురాతన దేవాలయ పునర్నిర్మాణానికి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా స్పందిస్తూ.. ఇటీవలే 515 ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని, అర్హత కలిగిన నిరుద్యోగులు సెప్టెంబరు 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టౌన్‌షిప్ అడ్మినిస్ట్రేషన్ ఏజీఎం సురన్‌ప్రసాద్, సంస్థ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఉపకమిషనర్ పర్యటన


లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న ఉపకమిషనర్ శశిరేఖ

చందానగర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందానగర్ సర్కిల్-21 ఉపకమిషనర్ శశిరేఖ సూచించారు. సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలను అధికారులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. మల్కం చెరవులోకి వస్తున్న వరదనీరు, చెరువు కట్ట, పలు ప్రాంతాల్లో రోడ్లపై చేరిన వర్షం నీటిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అవసరం లేకుండా బయటికి రావద్దన్నారు. బయటికి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లింగంపల్లి అండర్ బ్రిడ్జ్ వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చెత్త పేరుకుపోకుండా చూడాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, అందుకు కారణమైన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని ఉపకమిషనర్ శశిరేఖ శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బుధవారం చందానగర్ మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలలో, రహదారులపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

- అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి


సీఐ వెంకట్ రెడ్డిని సన్మానిస్తున్న గాయత్రీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

అల్లాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాల నిర్వాహకులు భద్రత చర్యలు పాటించాలని సీఐ వెంకట్‌రెడ్డి సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో అల్లాపూర్ పీఎస్ అధికారులు పీస్ కమిటీ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాయత్రీ నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే వినాయకచవితి పండుగ దృష్ట్యా మండపాల ఏర్పాటులో నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు పాటించాలన్నారు. కాలనీల్లో వీధులు పెద్దగా లేవన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు వెళ్లేలా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం కారణంగా విద్యుత్ ప్రమాదాలకు తావివ్వకుండా నాణ్యమైన విద్యుత్ కేబుళ్లతో అలంకరణ దీపాల వైరింగ్ చేయించాలని ఆయన సూచించారు. బాధ్యతాయుత ఎలక్ట్రీషియన్లతో ఇలాంటి పనులు చేయించుకోవాలని, అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. రాత్రిళ్లు 10 గంటల తర్వాత పరిసర ప్రాంతాల ప్రజలకు అసౌకర్యం కలగకుండా ధ్వనులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు, సంఘం ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, జితేంద్ర, నాయుడు, ఎస్సై మాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బండి రమేష్, మహిళా నాయకులు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- కాంగ్రెస్ నేత బండి రమేష్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆంజనేయ నగర్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజనేళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో మహిళా నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళా సంఘాల గ్రూపులను బలోపేతం చేసి ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ కోసం పనిచేసే మహిళా నాయకులకు పదవులు ఇస్తామని, వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రజిత, రీనా తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం


రీతూయాదవ్‌కు జన్మించిన మగశిశువుతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ లక్ష్మణ్, పైలెట్ అద్వీత్‌రెడ్డి

కూకట్‌పల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 108లో మహిళకు ప్రసవం జరిగింది. ఆమెకు మగశిశువు జన్మించాడు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. విషయానికొస్తే.. బతుకుదెరువు కోసం చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చిన రీతూయాదవ్ కుటుంబం హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీ సమీపంలో నివాసం ఉంటుంది. ఏడు నెలల గర్భిణి రీతూయాదవ్‌కు పురిటి నొప్పులు రావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. మెడికల్ టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ అద్వీత్‌రెడ్డి ఈ ప్రాంతానికి చేరుకున్నారు. అయితే అప్పటికే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో గర్భిణిని ఎక్కించి టెక్నీషియన్ లక్ష్మణ్ పురుడు పోశాడు. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. వెంటనే వైద్య చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. టెక్నీషియన్‌ను పలువురు అభినందించారు.



టీచర్లతో మాట్లాడుతున్న తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న పరిశీలించారు. జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో తరగతి, కంప్యూటర్ గదిని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బాలప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షాలపై అత్యవసర సమావేశం

నిజాంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో నిజాంపేట, దుండిగల్ మున్సిపల్ కార్యాలయాలలో కమిషనర్లు సాబేర్ అలీ, వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో అకాల వర్షాలపై అత్యవసర సమావేశాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్లు అన్ని శాఖల మధ్య సమన్వయం కల్పించుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ప్రాణనష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అత్యవసర సమయంలో సహాయ పడేందుకు అన్ని విభాగాల సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తక్షణ స్పందన కోసం నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై నీరు వరదలు వచ్చినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలనే విషయాలను అధికారులకు కమిషనర్లు సూచించారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల నిర్వాహకులు

మెరుగైన వైద్యం కోసం హెల్త్‌కేర్ సంస్థల ఒప్పందం

నిజాంపేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి, అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ సంస్థలు ఒక వ్యూహాత్మక నిర్వహణ ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. నిజాంపేటలో 800 పడకల అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని కలిసి నిర్వహిస్తామని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ రెండు సంస్థల నిర్వాహకులు వెల్లడించారు. ఈ కొత్త ఆస్పత్రిలో అత్యవసర చికిత్స, గుండె జబ్బులు, క్యాన్సర్ ఆస్పత్రి వంటి వాటికి మంచి వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఆస్పత్రి నిర్మాణాన్ని దశల వారీగా పూర్తిచేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌జీ ఆస్పత్రి చైర్మన్ దుండు శివరామరాజు, అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ సంస్థ చైర్మన్ డా.అజెంక్య ఈ సంస్థల ఒప్పందం వల్ల మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సన్మానిస్తున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు

హైడ్రా కమిషనర్‌కు సన్మానం

కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ మండలం చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను స్థానికులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేయగానే చర్యలు చేపట్టిన ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. సదరు స్థలంలో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేసిన సిబ్బందిని కూడా సత్కరించారు. 3,500 గజాల స్థలం 2,500 గజాలకు మిగిలి ఉందని, హైడ్రా ఫెన్సింగ్ వేయకపోతే అది కూడా ఆక్రమణలకు గురయ్యేదని భగత్‌సింగ్‌నగర్ వాసులు తెలిపారు. ఇటీవల సదరు స్థలంలో వెలిసిన ఆక్రమణలను తొలగించి ఆ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోవాలని ఆయనను కోరినట్లు కాలనీ వాసులు తెలిపారు.



కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసిన కూనంనేని సాంబశివరావు

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

గాజులరామారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు గాజులరామారంలో నిర్వహించే సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మహాసభల నిర్వహణ కోసం కుత్బుల్లాపూర్‌లో పర్యటించిన సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా విరాళాల సేకరణ చేపట్టారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వెయ్యిమంది వరకు ప్రతినిధులు వస్తారని, మూడు రోజుల పాటు జరిగే చర్చల్లో పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజల సమస్యలను భవిష్యత్‌లో పార్టీ ఉద్యమ నిర్మాణం కోసం తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ అభివృద్ధి కోసం సూచనలు, సలహాలతో దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలియజేశారు. హన్మంత్‌రెడ్డిని కలిసిన వారిలో సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుండిగల్‌కు నిధుల మంజూరుపై హర్షం

దుండిగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ మౌలిక సదుపాయాల కోసం రూ.74.34 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు గాను సీఎం రేవంత్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నిధుల విడుదలపై కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయంలో హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ, దుండిగల్ మున్సిపల్‌లో కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని విధంగా బీఆర్ఎస్ పరిపాలన సాగించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందన్నారు. మున్సిపల్‌లోని ప్రతిబస్తీ, కాలనీలో అధికారులు పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, గాగిల్లాపూర్ మాజీ సర్పంచ్ బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, జక్కుల మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆకర్షణగా..

రంగులు అద్దకుండా

30 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్న కుటుంబం

నేచురల్‌గా విగ్రహాలను రూపొందించడం వీరి ప్రత్యేకత



రంగులు లేకుండా రూపొందించిన వినాయకుడు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటికోసం నగరానికి వలస వస్తున్న వారంతా ఏదో ఒక ఉద్యోగం చేయడం, కొందరు చిరు వ్యాపారాలు నిర్వహించుకోవడం ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇందులో భాగంగానే రాజస్థాన్ రాష్ట్రం జాలూర్ జిల్లా ధర్మి ప్రాంతానికి చెందిన హిమ్మత్, ధర్మి దంపతులకు ఐదుగ్గురి సంతానం. ఉన్న ఊరిలో చేతినిండా పనిలేక కుటుంబ పోషణ భారమవుతుండడంతో 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి గాజులరామారం సర్కిల్‌లో అద్దెకు దిగారు. వారికి చదువు లేకపోవడంతో నగరంలో వినాయక విగ్రహాలను విక్రయించేందుకు శ్రీకారం చుట్టాడు. అయినా పూట గడవడం కష్టంగా మారింది. దీంతో తాను స్వయంగా విగ్రహాలను తయారు చేయాలని నిర్ణయించుకుని ఫైనాన్స్ ద్వారా ముడి సరుకు తెచ్చుకుని విగ్రహాలను తయారు చేశాడు. మొదటిసారి విక్రయించినప్పుడు బాగా అనిపించడంతో అదే తడవుగా శ్రీరామ నవమి, వినాయక చవితి, ఇతర ఉత్సవాలకు సంబంధిత విగ్రహాలను తయారు చేయడం వృత్తిగా చేసుకున్నారు. కుత్బుల్లాపూర్‌లో చిన్నగా ప్రారంభించి ఇప్పుడు దేవేందర్‌నగర్, జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సబ్ స్టేషన్ తదితర ప్రాంతాలలో వ్యాపారం నిర్వహిస్తున్నారు.



సింధూరం రంగులో గణేశుడి విగ్రహం

రసాయనాలు లేకుండా..

హిమ్మత్ కుటుంబం రసాయనాలు లేకుండా విగ్రహాలను తయారు చేస్తున్నారు. నల్లమట్టి, వైట్ సిమెంట్, కొబ్బరి పీచుతో తయారు చేస్తారు. హిమ్మత్‌తో పాటు భార్య, ఐదుగురు కుమారులు కూడా ఇదే వృత్తిని ఎంచుకున్నారు. ప్రస్తుతం హెచ్ఎంటీ తయారీ కేంద్రం వద్ద 50, సబ్ స్టేషన్ వద్ద 75, దేవేందర్‌నగర్‌లో 100 చిన్న, పెద్ద సైజు విగ్రహాలను తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. నాలుగైదు రోజుల్లో అందుబాటులోకి తెస్తామని హిమ్మత్ చెబుతున్నాడు. రూ.2 నుంచి రూ.12 వేల వరకు ధర ఉంటుందని చెబుతున్నారు.



30 యేండ్లుగా...

30 ఏళ్ల క్రితం నగరానికి వచ్చాం. అప్పట్నుంచి విగ్రహాల తయారీనే వృత్తిగా ఎంచుకుని కుటుంబమంతా కష్టపడుతున్నాం.నాలుగైదు రోజుల్లో విగ్రహాలను పూర్తిగా సిద్ధం చేస్తాం. రసాయనాలను ఉపయోగించం. కొన్నింటికి మాత్రం ప్రజల అభిరుచికి తగినట్లుగా కొంచెం రంగులు అద్దుతాం.

- హిమ్మత్, విగ్రహాల తయారీదారుడు



విగ్రహానికి రంగులు అద్దుతున్న హిమ్మత్

దేశ ఎదుగుదలలో పిల్లలను భాగస్వాములు చేయండి

ఎంపీ ఈటల రాజేందర్



ర్యాలీ అనంతరం ప్రసంగిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

పేట్ బషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాబోయే కాలంలో మన పిల్లలను కమిట్‌మెంట్‌తో ఈ దేశ ఎదుగుదలలో భాగం పంచుకుని గొప్ప పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి పిలుపునిచ్చారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీలో ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దేశ భక్తి గీతాలు, జాతీయ నినాదాలతో మున్సిపాలిటీ హోరెత్తింది. 300 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మున్సిపాలిటీలో ఇప్పటికే 500 జాతీయ జెండాలను ఇంటింటికి పంపిణీ చేశారు. మరో 500 జెండాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరితారావు, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు జనార్ధన్‌రెడ్డి, ఓబీసీ ఉపాధ్యక్షుడు బుర్గుబావి అశోక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణ కోసం కృషిచేస్తాం





నిజాంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది, మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, అధికారులు

దుండిగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో దుండిగల్, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడ చూసినా మాదక ద్రవ్యాల సమస్య రోజు రోజుకు పెరిగిపోతుంది కాబట్టి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన నేపథ్యంలో దానిని నిరోధించడానికి కట్టడికి చర్యలు చేపట్టడానికి తామంతా కృషి చేస్తామని పోలీసులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో గండిమైసమ్మ తహసీల్దార్ మతిన్, దుండిగల్ సీఐ సతీష్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, డీపీపల్లి ఏఈ, మున్సిపల్ వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపేట కార్పొరేషన్‌లో..

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మాదక ద్రవ్యాల నిరోధానికి కట్టుబడి ఉంటామంటూ.. ప్రజలను కూడా చైతన్యం చేస్తామని కమిషనర్ సాబేర్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, హైడ్రా, విద్యుత్, మున్సిపల్ అధికారులతో ప్రమాణం చేయించారు.

ఎటుచూసినా.. గుంతలమయమే



పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఫాక్స్ సాగర్ మీదుగా రాంరెడ్డి నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారుల్లో ఎటు చూసినా గుంతలమయమే. అందులోనూ వర్షం నీరు చేరడంతో ఈ రహదారుల్లో వాహనాలు వెళ్లాలంటే ప్రయాణికులు, పాదచారులకు నరకంగా మారింది. అధికారులు స్పందించి ఈ దారిలో గుంతలను పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్, (ఆంధ్రజ్యోతి)

వానపడితే నరకమే..!

- ప్రమాదకరంగా మల్లంపేట రోడ్డు
- నిత్యం ఏదో ఒక ప్రమాదం
- ఆందోళనలో వాహనదారులు



మల్లంపేటలో గుంతల్లో పల్టీ కొట్టిన ఆటో



గుంతల వద్ద నిలిచిన వాహనాలు

దుండిగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట గ్రామంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ఏమాత్రం వర్షం పడినా... నీరు రోడపై నిలిచి వాహనదారులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. ఈవిషయమై కొన్ని నెలలుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదని మల్లంపేట వాసులు ఆరోపిస్తున్నారు. బుధవారం ఉదయం వాన నీటికి బురదలో ఆటో గుంతల్లో పడిపోయింది. కానీ ఎవరికీ ఏమీ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పక్కనే ఉన్న స్కూల్ వ్యాన్‌కు కూడా పెను ప్రమాదం తప్పింది. మల్లంపేట ప్రాంతంలో జనాభా విపరీతంగా పెరగడం, మల్లంపేట వద్ద ఓఆర్ఆర్ ఎగ్జిట్ ఏర్పాటు చేయడం వంటి కారణాలతో నిజాంపేట, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలంతా ఇదే రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. బాచుపల్లి నుంచి మల్లంపేట ప్రాంతంలోని ఐటీసీ భద్రాచలం ప్రాంతం వరకు రోడ్డు వేసి డివైడర్ ఏర్పాటు చేశారు. అదే విధంగా మల్లంపేట నుంచి బౌరంపేట వరకు రోడ్డు నిర్మించి డివైడర్ ఏర్పాటు చేశారు. దాని వల్ల అక్కడ ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. ఐటీసీ భద్రాచలం రోడ్డు నుంచి మల్లంపేట గ్రామం వరకు మధ్యలో వదిలేశారు. ఇక్కడ కూడా రోడ్డు నిర్మించి డివైడర్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య గానీ, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముండదు. ఆ దిశగా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రమాదాలు జరిగితేగాని అధికారులు స్పందిస్తారా..? ప్రస్తుత పరిస్థితి చూస్తే అలాగే కనిపిస్తుందని స్థానికులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోయాక అధికారులు స్పందిస్తే ఏం ప్రయోజనమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు దీనిపై దృష్టి సారించి ఈ రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించి డివైడర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని డిమాండ్ చేస్తున్నారు.



ప్రియదర్శినికి బంగారు గొలుసును అందజేస్తున్న బాచుపల్లి పోలీసులు

పోగొట్టుకున్న హారం దొరికింది

నిజాంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రగతినగర్‌లో 12 గ్రాముల బంగారు హారం పోగొట్టుకున్న మహిళకు పోలీసులు వెతికి అందజేశారు. ప్రగతినగర్‌కు చెందిన ఇందిర ప్రియదర్శిని మంగళవారం ప్రగతినగర్‌లోని భజరంగ్ జువెల్లర్స్ వెలుపల తన హారం పోగొట్టుకున్నట్లు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై డీఐ సురేష్ తన సిబ్బందితో ఆ స్థలాన్ని సందర్శించి, సీసీ కెమెరాలను పరిశీలించి బంగారు గొలుసును కనిపెట్టారు. ఈమేరకు పోలీసులు బుధవారం గొలుసును బాధితురాలికి అప్పగించారు.

కరెంట్ సమస్యలొస్తే సమాచారం ఇవ్వండి : ఏఈ



చైతన్య భార్గవ్

గాజులరామారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజులరామారం విద్యుత్ ఏఈ చైతన్య భార్గవ్ సూచించారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ భారీ వర్షాలు, ఈదురు గాలులతో విద్యుత్ సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తీగలు కిందికి వేలాడినా.. తెగిపోయినా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వివరాలకు.. ఎఫ్ఓసీ 2592, గాజులరామారం లైన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ 8712472607, లైన్‌మన్ శంకర్ గౌడ్ 8712472617, మహదేవపురం లైన్‌మన్ కిరణ్‌కుమార్ 8712472618, లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ 8712472608, ఏఈ చైతన్యభార్గవ్ 8712472564, ఏడీఈ శ్రీకాంత్ 8712472561, డీఈ మేడ్చల్ జాన్‌రాజు 8712472560 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న మంత్రి సత్యనారాయణ

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

షాపూర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సౌకర్యార్థం కాలనీల్లో సమస్యలు లేకుండా చూస్తున్నామని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్‌లోని విశ్వకర్మ కాలనీలో రూ.49 లక్షల 50 వేలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, కాలనీలోని సమస్యలను తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సదానందనం, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిది..!



ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

రెండురోజులుగా పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సిగ్నళ్లు సరిగా పనిచేయక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చింతల్ ప్రధాన రహదారి హ్యాపీ చిల్డ్రన్స్ ఆస్పత్రి వద్ద పాదచారులు రోడ్డు దాటేందుకు ఏర్పాటు చేసిన సిగ్నళ్లు రెండు రోజులుగా పనిచేయడంలేదు. నిత్యం వేలాది మంది రోడ్డు దాటుతుంటారని, సిగ్నల్స్ లేక రోడ్డు దాటాలంటేనే భయమవుతుందని పాదచారులు చెబుతున్నారు. ఇష్టానుసారంగా వాహన దారులు గీత దాటుతున్నారు.